ప్రభుత్వ భూములను పేదలకు పంచండి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల : మండలంలోని అక్కల్‌రెడ్డిపల్లె కృపానగర్‌లో భూమిలేని పేదలందరికీ ప్రభుత్వం భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అక్కల్‌రెడ్డిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1853 1854లో ప్రభుత్వ భూములు దాదాపు 500 ఎకరాలు ఉన్నాయన్నారు. భూమిలేని పేదలందరికీ మూడు ఎకరాలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కలెక్టర్, బద్వేలు ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు భూమిలేని పేదలందరూ అర్జీలు పెట్టించామన్నారు. ప్రభుత్వం, రెవెన్యూ ఉన్నతాధికారులు భూ పంపిణీ చేపటకపోవడం భూమిలేని నిరుపేదలందరికీ నిర్లక్ష్యం చేయటం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా దౌర్జన్యంగా అనర్హుల వందల ఎకరాలు సాగు చేస్తున్న రెవెన్యూ అధికారులు వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది సంవత్సరాల నుంచి పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేయకుండా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని పేర్కొన్నారు. అనంతరం విఆర్ఒ జహీర్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, సగిలి గురవయ్య, ఎన్.వీరయ్య పాల్గొన్నారు

జిఎంసి పోస్టుల భర్తీలో ఇష్టారాజ్యం

- రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా ఎంపికలు
- క్యాన్సర్ ల్యాబ్ పోస్టు భర్తీలో మెరిట్ గల్లంతు
- బ్లడ్‌బ్యాంక్ పోస్టుల భర్తీలో అంతులేని నిర్లక్ష్యం
- న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిసిస్ట్ అర్హతలో గందరగోళం
- తప్పులతడకలుగా ఎంపిక ప్రక్రియ
- నేడు 130 పోస్టులకు అపాయింట్‌మెంట్స్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో ఇష్టారాజ్యం నడుస్తోంది. జిల్లా వైద్యకళాశాల పరిధిలోని మానసిక, క్యాన్సర్, సూపర్‌స్పెషాలిటీ, పులివెందుల వైద్య కళాశాల పరిధిలోని ఐఎంఎస్ పరిధిలో 14 కేటగిరీలు, కేన్సర్ కేర్ పరిధిలో 10, జిఎంసి పరిధిలో 06, జిజిహెచ్ పరిధిలోని 21 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు పోస్టులకు భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. రెండు నెలల కింద నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగార్థులు ఎనిమిది వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. సుధీర్ఘ స్క్రీనింగ్ అనంతరం ఆయా కేట గిరీల పరిధిలోని పోస్టుల భర్తీకి అర్హతల పరిశీలన, రిజర్వేషన్లు, సీని యారిటీ తదితర ప్రక్రియల్ని పరిశీలించాలి. ఫైనల్ లిస్టు ప్రకటన అనంతరం సెలెక్షన్ లిస్టును విడుదల చేయాలి. స్క్రీనింగ్ దశలో గ్రీవెన్స్ ఎదురైతే రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టిన అనంతరం సెలెక్షన్ లిస్టు విడుదల చేయాలి. కానీ ఇక్కడ రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండానే సెక్షన్స్ లిస్టును విడుదల చేయడంతో గందరగోళం నెలకొంది. న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిసిస్ట్ అర్హతల్ని మెడిసిన్ ఫిజిసిస్ట్ కేటగిరీల్లోకి చూపించారు. దేశంలోని కేరళ, ఉస్మానియా వంటి ఐదారు యూనివర్శిటీల్లో న్యూక్లియర్ ఫిజిసిస్ట్ కోర్సును చదివిన తమను నిర్లక్ష్యం చేయడమేమిటని ఉద్యోగార్థులు వాపోతున్నారు. కర్నూలు, గుంటూరు వైద్య కళాశాలల ఉన్నతాధికారులు ఆధునిక కోర్సు కావడంతో పొరపాటు పడిన కారణంగా రీనోటిఫికేషన్ ద్వారా భర్తీ చేశారని, ఇక్కడ ఇగోకు పోయి జీవితాలతో ఆడుకోవడం తగదని వాపోతున్నారు. బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎస్‌సి కేటగిరీ వ్యక్తిని ఒసి కేటగిరీలో చూపించి భర్తీ చేయడం, ఎస్‌సి కేటగిరీలో వేకెంట్ చూపించారు. కేన్సర్ ల్యాబ్స్ కేటగిరీలో సంబేపల్లికి చెందిన ఓ వ్యక్తి 71 మార్కుల మెరిట్‌తో ఉండగా, 70 మార్కులు కలిగిన వ్యక్తికి మెరిట్‌గా చూపించడంపై చర్చనీయాంశమైంది. కడప జిజిహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు జూనియర్లకు అవకాశం కల్పించి తనకు అన్యాయం చేయడంపై క్లారిటీ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించినా ఇవ్వక పోవడమేమిటని ప్రశ్న వినిపిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కేటగిరీలో 12 మంది పీజీ (డిప్లమా) ఉద్యోగార్థులను విస్మరించి డిగ్రీ చేసిన ఉద్యోగార్థులకు అవకాశం కల్పించడమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. దీనిపై పలువురు నిరుద్యోగార్థులు కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అన్నిటికంటే ముందు రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టును పెట్టకుండా, సెలెక్షన్ లిస్టును ప్రకటించడమేమిటని ప్రశ్న వినిపిస్తోంది. పలువురు ఉద్యోగార్థులు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ సురేఖను చుట్టుముట్టి అభ్యర్థలను వినిపించారు. దీనికి ప్రిన్సిపల్ స్పందించి మెరిట్ లిస్టు పెట్టామని సమర్థించుకునే ప్రయత్నం చేయడం కని పించింది. తాము స్పష్టమైన అవగాహనతోనే ముందుకెళ్లామని, మీ అభ్యర్థనలేమైనా ఉంటే ఇవ్వాలని సూచించారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్పందించి ముందు రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టు పెట్టాలని పట్టుబట్టారు. చాలా మంది నష్టపోతారని, భవిష్యత్‌లో దుష్ఫలితాలు వస్తాయని విజ్ఞప్తి చేశారు. దీనికి ప్రిన్సిపల్ సానుకూలంగా స్పందించారు. ఇదిలాఉండగా ఇప్ప టికే కలెక్టర్ అప్రూవల్ చేసిన నేపథ్యంలో ఐఎంఎస్, కేన్సర్ కేర్, జిఎంసి, జిజిహెచ్, పులివెందుల మెడికల్ కళాశాలకు చెందిన 196 పోస్టుల్లో 130 పోస్టులను భర్తీ చేయనున్నారు. మిగిలిన 66 పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్లలో తప్పిదాలు, ఇతర కారణాల కారణంగా వాయిదా పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం కమిటీ సభ్యులు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలించిన అనంతరం నియామక ఉత్తర్వులు ఇచ్చే పనిలో నిమగ్నం కానున్నట్లు తెలుస్తోంది.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. 2023 ఖరీఫ్‌లో వర్షాభావం (కరువు), డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవన రైతన్నల ఖాతాలలో బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్‌గా బటన్ నొక్కి ఇన్పుట్ సబ్సిడీని జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుండి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షులు జకియా ఖానం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. అన్నమయ్య జిల్లాలోని మొత్తం 19516.21 హెక్టార్లకు గాను 34,889 మంది రైతుల ఖాతాలలో రూ.35.57 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ జమ చేశారు. ముఖ్యమంత్రి వర్చువల్ సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 2023 ఖరీఫ్‌లో వర్షాభావం (కరువు) వల్ల 15946.36 హెక్టార్లలో పంటలు నష్టపో యిన 29026 మంది రైతన్నలకు రూ 26.37 కోట్లు, డిసెంబరులో మిచాంగ్ తుఫాను వల్ల 3569.84 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నష్టపోయిన 5863 మంది రైతులకు రూ.9.20 కోట్ల నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేశామన్నారు. అన్నదాతలకు అండగా నిలబడాలనే లక్ష్యముతో విత్తు నుండి విత్తనం వరకు ప్రతి దశలో రైతులకు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ బలోపేతం చేయడానికి వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలను అందుబాటులో ఉండే విధముగా రైతు భరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారని చెప్పారు. కల్తీలేని నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, ఇ-క్రాప్ బుకింగ్ ద్వారా పంటల బీమా, వడ్డీలేని రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ మొదలగు సేవలను అందిస్తూ ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాల అండగా నిలబడుతోందని చెప్పారు. ప్రకృతి విపత్తుల వలన నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కలిగించడానికి సీజన్ ముగిసేలోగా క్రమం తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షులు జకియా ఖానం మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ రైతు రాజ్యం తెచ్చారు. వ్యవసాయాన్ని ఒక పండుగలా చేశారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్తో పాటు రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి రైతు భరోసా, వడ్డీ లేని రుణాలు, కల్తీ లేని విత్తనాలు, ఎరువులు, 9 గంటల ఉచిత విద్యుత్తు, రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు తదితరాలతో రైతులను పూర్తిగా ఆదుకుంటున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసే లోగానే పరిహారం అందిస్తాం అన్న మాటను మరొకసారి నిలబెట్టుకుంటూ నేడు రైతుల ఖాతాలలో పంట నష్టం జమ చేశారని పేర్కొన్నారు. రైతు సంక్షేమ పథకాలే కాకుండా ప్రజల సంక్షేమానికి కూడా ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత నిస్తున్నారని పేర్కొన్నారు. డిబిటి ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి అందుతోందని చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, మహిళా శిశు సంక్షేమంలో భాగంగా బాలింతలు, గర్భిణులులు, పిల్లలకు సంపూర్ణ పోషణ లాంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా చేయగలిగిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని కూడా వారు పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇన్పుట్ సబ్సిడీ పరిహారం రూ.35.57 కోట్ల మెగా చెక్కును రైతులకు అందజేశారు. జమ చేసిన ఇన్‌పుట్ సబ్సిడీని రాయచోటి నియోజకవర్గానికి సంబంధించి 10,572 మంది రైతులకు రూ.10.03 కోట్లు, పీలేరులో 4404 మంది రైతులకు రూ.4.16 కోట్లు, రాజంపేటలో 2169 మంది రైతులకు రూ.3.48 కోట్లు, రైల్వేకోడూరులో 4447 మంది రైతులకు రూ.6.43 కోట్లు, తంబళ్లపల్లిలో 12,339 మంది రైతులకు రూ.11.07 కోట్లు, మదనపల్లి నియోజకవర్గానికి 958 మంది రైతులకు రూ.0.40 కోట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి చంద్ర నాయక్, ఎడిఎ సువర్ణలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి రవిచంద్రబాబు, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

స్కానింగ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ శైలజ

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శైలజ తనిఖీ చేశారు. ప్రతి ఒక స్కానింగ్ సెంటర్లో రికార్డులను పరిశీలించి తగిన సూచన సలహాలు ఇచ్చారు. స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన ప్రజలకు ఇస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు అనుగుణంగా స్కానింగ్ నిర్వహిస్తున్నారో లేదో అని పరిశీలించి అక్కడి డాక్టర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. చట్ట విరుద్ధమైన స్కానింగ్ నిర్వహించి ఫలితాలు తెలిపితే అటువంటి స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి, భార్యపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లి

మండల పరిధిలోని వేంపల్లి గ్రామంలో తల్లి, భార్యపై మద్యం మత్తులో దాడిని వ్యక్తిని అరెస్టు చేయలని జిల్లా ఐద్వా కన్వీనర్ భాగ్యమ్మ, పట్టణ నాయకురాలు రెడ్డిప్రసన్నలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపల్లి గ్రామంలో నివాసమున్న అనూష అనే మహిళపై తన భర్త మదన్మోహన్ మద్య మత్తులో విచక్షణ రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచడం దారుణమని అన్నారు. అడ్డుగా వచ్చిన తన తల్లిపై కూడా దాడికి పాల్పడటం హేయనీమన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టచేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అపోలో ఫార్మశీ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఆనందరెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు 50 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో ఏడుగురు అభ్యర్థులను ఉద్యోగానికి ఎంపిక చేసుకొని అక్కడికక్కడే నియామక పత్రాన్ని అందించారని పేర్కొన్నారు. అందజేశారన్నారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులందరూ తమ ఉద్యోగాన్ని కృతనిశ్చయంతో చేసి, పదోన్నతులు పొంది ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అపోలో హెచ్.ఆర్ వాసు, ప్రభుత్వ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, బిటి కాలేజీ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, కెమిస్ట్రీ అధ్యాపకుడు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

సిటిఎంలో అమానుషం

ప్రజాశక్తి-మదనపల్లి

రజిత అనే మూగ, చెవిటి గల విభిన్న ప్రతిభావంతురాలిని ఇంటి నుంచి బయటకు గెంటేసి ఇంటిని ఆక్రమించుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని సిటిఎంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సిటిఎంలో నివాసమున్న రజితకు తల్లిదండ్రులు ఏడు సంవత్సరాల క్రితం మృతి చెందారని, అక్క ఎక్కడికో వెళ్లి పోయిందని అన్నారు. తమ్ముడు మద్యానికి బానిసై ఇంటికి రాడని తెలిపారు. రజిత ఒంటరితనాన్ని ఆసరా చేసుకుని సమీప బంధువులు ఇంటిని ఆక్రమించి, ఇంటిలోని వస్తువులు బయట పడేసి ఇంటికి బీగం వేసి రజితను గెంటేశారని అన్నారు. ఎటువంటి ఆసరా లేని ఆ బాలికకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటికి తాళం వేయడంతో ఒంటరిగా ఉన్న రజిత

వైకల్యంపై ఆత్మవిశ్వాసం గెలుస్తుంది : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి

విభిన్నప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో రాయచోటి నియోజకవర్గంలోని విభిన్నప్రతిభావంతులకు బ్యాటరీ ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలను శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఎన్నడూ లేని విధంగా జిల్లాలో రెండు విడుదలుగా విభిన్నప్రతిభావంతులకు వారికి అవసరమైన పరికరాలు అందజేశామని పేర్కొన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అలిమ్ కో-సంస్థతో మాట్లాడి అర్హత ఉన్న వారందరికీ పరికరాలు ఇప్పించడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం వెళ్ళినప్పుడు వికలాంగుల స్థితిగతులు చెప్పినప్పుడు ఏదో రకంగా వీరికి సహాయం చేయాలనే ఆలోచనతో నేడు ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.కాళ్లు లేని వారికి, మాటలు వినపడని వారికి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తూ ఉంటే మనస్సుకు ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. ప్రభుత్వం మానవత్వంతో చేస్తున్న ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ప్రతి వ్యక్తిలో ఒక ప్రత్యేకత, నైపుణ్యం ఉంటుందని, దివ్యాంగులలో ఎంతో నైపుణ్యం గలవారు ఉన్నారని వీరందరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష సాధన దిశగా ముందుకు వెళితే అనుకున్నది సాధించవచ్చునన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విభిన్నప్రతిభావంతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 613 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.1,03,97,155 విలువ చేసే పరికరాలు అందజేశామన్నారు. ప్రభుత్వం విలువైన పరికరాలు ఉచితంగా అందజేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్నవారు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారందరికీ అర్హత మేరకు పరికరాలు ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్, పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెసి

బిసిల సాధికారతే టిడిపి లక్ష్యం : 'బత్యాల'

మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బిసిల సాధికారతే టిడిపి లక్ష్యమని, వారి అభ్యున్నతికి కృషి చేస్తామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. బుధవారం బత్యాల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం గుంటూరు జిల్లాలోని నాగార్జున యూనివర్సిటీ సమీపంలో జరిగిన బిసి గర్జన సభ విజయవంతమైందని అన్నారు. బిసిలకు 50 సంవత్సరాలకి పింఛన్ అమలు చేయడమే కాక, రూ.4 వేలు వరకు పింఛన్ పెంపుదల నిర్ణయం హర్షనీయమన్నారు. బిసిలపై దాడులు, దౌర్జన్యాలు నుంచి రక్షణ కొరకు ప్రత్యేక బిసి రక్షణ చట్టం తీసుక వస్తారన్నారు. సబ్ ప్లాన్ నిధుల ద్వారా ఐదేళ్లలో ఒకటిన్నర లక్షలకోట్లు ఖర్చు చేసి ఆ నిధులు కేవలం బిసిలు మాత్రమే వినియోగించుకునేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక సంస్థలలో గతంలో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు తిరిగి పునరుద్ధరించడం, చట్టసభలలో 33శాతం రిజర్వేషన్ కోసం కేంద్రానికి తీర్మానం పంపడం, అన్ని సంస్థలు, నామినేటెడ్ పదవులలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం, తక్కువ జనాభాతో ఎన్నికలలో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామని తెలిపారు. 10 లక్షలతో చంద్రన్న బీమా పునరుద్ధరణ, లక్ష పెంపుతో పెళ్లి కానుక, చట్టబద్ధంగా కుల గణన, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం, విద్య పథకాలు అన్ని తిరిగి పునరుద్ధరణ చేయడం వంటి అద్భుతమైన పథకాలతో బిసి సమగ్రాభివృద్ధికి టిడిపి కట్టుబడి చంద్రబాబు మ్యానిఫెస్టో ప్రకటించారని అన్నారు. బిసి భవ నాలతో పాటు ఏడాదిలోపే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పూర్తి చేసి బిసి సంక్షేమం, సమగ్రాభివృద్ధికి, బిసిలకు అండగా ఉంటుందని తెలిపారు.

రథయాత్రతో వైసిపి గుండెల్లో గుబులు

రాష్ట్ర వ్యాప్తంగా జనసేన ప్రారంభించిన రథయాత్రతో వైసిపి గుండెల్లో గుబులు మొదలైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు, జనసేన సమన్వయకర్త అతికారి దినేష్ పేర్కొన్నారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయం నుంచి 25 వాహనాలతో రథయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మచిలీపట్నానికి చెందిన కొట్టే ఉదయ్‌భాస్కర్ సోదరులు తమ సొంత నిధులతో ఈ వాహనాలను ఏర్పాటు చేసి రాష్ట్రం నలుమూలలకు పంపి జనసేన సిద్ధాంతాలు, పవన్‌కల్యాణ్ ఆశయాలతో పాటు టిడిపి, జనసేన ఉమ్మడి లక్ష్యం, కార్యాచరణను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాక్షస పాలనను, దౌర్జన్య కాండను ఎండగట్టేందుకు ఈ రథయాత్ర దోహదపడుతుందని తెలిపారు. ఉమ్మడి పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పోరాడి రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.

వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వైసిపి సీనియర్ నాయకులు కోడి శ్రీనివాసులురెడ్డి (కోడిశ్రీను) వారిఅనుచర వర్గం రెండు వేల మందితో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో బుధవారం టిడిపిలో చేరారు. రాంప్రసాద్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఆయన తోపాటు మార్కెట్‌యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్‌బాషా, 18వ వార్డు కౌన్సిలర్ మడితాడి సరోజమ్మ, మాజీ కౌన్సిలర్లు మిట్ట సంజీవరెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు జాఫర్‌వలిలు టిడిపిలో చేరారు.

శ్రీనివాసులురెడ్డిని కండువాకప్పి ఆహ్వానిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

విద్యార్థులతో ఎంజెఆర్ కళాశాల యాజమాన్యం

ప్రాక్టికల్ అధ్యయనం చాలా అవసరం

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులకు పుస్తక పఠనంతోపాటు ప్రాక్టికల్ అవగాహన చాలా అవసరమని పీలేరు ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి తెలిపారు. కళాశాలలో మూడవ సంవత్సరం ఇఇఇ, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అకాడమిక్ శిక్షణలో భాగంగా బుధవారం పీలేరులో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శనకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్, ప్రిన్సిపల్ ప్రారంభించారు. సబ్ స్టేషన్‌కు వచ్చిన విద్యార్థులకు అక్కడి ఎఇ రాంప్రసాద్‌రెడ్డి సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సేవలు, విద్యుత్ పరికరాల పని విధానం, ఎదురయ్యే సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించిన పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ ఎస్.రెడ్డి ఖాసీం, సుహేల్, భరత్, బాలాజి, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాదేవలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫార్మసీ విద్యారంగ పితామహుడు మహాదేవలాల్ ష్రాఫ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నమాచార్య ఫార్మశీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. బుధవారం జాతీయ ఫార్మశీ విద్యా దినోత్సవాన్ని బోయినపల్లిలో గల అన్నమాచార్య ఫార్మశీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి.స్వర్ణలత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మసీ రంగానికి మహదేవలాల్ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ప్రతి ఏడాది ఫార్మసీ విద్యా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతోందని తెలిపారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ఔషధ రంగంలో ముందుకు రావాలని, ఫార్మసీ విద్య ఆధునికతకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రజకులకు ప్రాధాన్యం కల్పించడం హర్షణీయం

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బిసి డిక్లరేషన్లో రజకులకు సముచిత ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమని జిల్లా రజక సంఘం అధ్యక్షులు టి.రమేష్ బాబు, కార్యదర్శి వి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసి డిక్లరేషన్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేయడం, రజకులకు నామినేటెడ్ పదవులు కేటాయింపు అభినందనీయమని తెలిపారు. రజకులకు చట్ట సభల్లో రిజర్వేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో, దేవాలయాల్లో దోభి ఉద్యోగాలు రజకులకే కేటాయింపు ఇస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రముఖ దేవాలయాల్లో పాలక మండలి సభ్యులుగా రజకులకు అవకాశాలు లాంటి హామీలు రజకుల అభ్యున్నతికి పాటు పడేలా ఉన్నాయని తెలిపారు.

జనసేనలో చేరిన యువకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట నియోజకవర్గ జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో బుధవారం యల్లమ్మ ఆలయ సమీపంలోని యల్లటూరు భవన్‌లో పాటూరు, సీతారామపురం, రామ్ నగర్, కొండ్లోపల్లికు చెందిన సుమారు 30 మంది యువకులు జనసేన పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలు నచ్చి పార్టీలో తెలిపినట్లు వారు తెలిపారు. కార్యక్రమం నంద్యాల హరి, పులి నరసింహా, రాహుల్, సిద్దయ్య, రమేష్, సాయి, సాయికృష్ణ, శివరాం, దుర్గ, అజయ్, నందకుమార్, లక్ష్మయ్య, సుధీర్, బాబు, గురివిగారి వాసు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన యువకులతో శ్రీనివాసరాజు

లబ్ధిదారులకు ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

ఇంటి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

జగనన్న కాలనీ ఇంటి స్థలాల పట్టాలను మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో 272 మంది లబ్దదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందించామని అన్నారు. సుద్దమాల 14 మందికి బండపల్లి, కుమ్మరపల్లిలో 34, గువ్వలచెరువు 10, హసనాపురంలో ఇద్దరికి, సరస్వతిపల్లి 8, రాచపల్లి 14, చిట్లూరు 33, గోపగుడిపల్లి, కొనిరెడ్డిగారిపల్లి 23, నీలకంఠరావుపేట 77, నల్లగుట్టపల్లి 42, కల్పనాయన చెరువులో 14 మంది లబ్దిదారులకు ఇంటి స్థలాల పట్టాలను అందించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, మాజీ ఎంపిపి గడికోట జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు భూషణ్‌రెడ్డి, సరస్వతిపల్లి సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ సూరం వెంకట సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలం పరిధిలోని వున్నటివారిపల్లి గ్రామంలో నివాసముంటున్న పంచర్ల రవి భార్యక పార్వతమ్మ పెరాలసిస్ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం గొప్ప భాగ్యమని తమకు చేతనైనంత వరకు పేదలకు సాయం అందిస్తామని చెప్పారు. బాధిత కుటుంబాలకు చెందిన వారు ఫౌండేషన్ సేవలు రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో నిరుపేద కుటుంబాలను అదుకుంటున్నారని అన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా సాయం చేసిందని ఆపదలో ఉన్న వారిని అండగా నిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యాక్రమంలో కొమురు శ్రీనివాసులురెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, వాసుదేవరెడ్డి, టంగుంటూరి శ్రీనివాసులు రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్, సాలవ రమణ, గౌతమ్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు పటిష్ట భద్రత

- సిఐ సూర్యనారాయణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలో శైవక్షేత్రాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సిఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని బీరంగి పంచాయతీ, గూగూటికోనలో వెలసిన బండెన్న స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అన్ని శైవక్షేత్రాలకు పోలీసు భద్రతను కల్పించామన్నారు. ముఖ్యంగా బండెన్నస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామితో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-కలకడ

అసంక్రమ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కదిరాయి చెరువు గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆరోగ్య శిబిరమునకు వైద్యాధికారులు డాక్టర్ ఎన్.దేవిప్రశాంతి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్ రెడ్డి చైతన్య, ఆప్తాల్మిక్ వైద్యులు విల్సన్ వైద్యశిబిరానికి హాజరైనారు. ఈ వైద్య శిబిరంలో రక్తపోటు షుగర్, బిపి, హిమ గ్లోబెన్, విడిఆర్, డెంగీ, మలేరియా టెస్ట్. సాల్ట్ టెస్ట్ రాపిడ్ టెస్ట్, స్ఫూటం టెస్ట్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.జయరామయ్య. జి. వి. కిషోర్, స్థానిక నాయకులు పంచాయతీ సెక్రటరీ కె.జయచంద్ర.పి.హెచ్ఎన్ కె. సుబ్బరత్న, సూపర్వైజర్ రెడ్డమ్మ, ఫార్మసిస్ట్ షరీఫ్‌బాషా, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ జమీల్‌అహ్మద్, ఎంఎల్ హెచ్‌పిలు, ఎస్.లావణ్య, కె.కనకమ్మ, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెకు చెందిన రైతు రామస్వామి పొలం పనులు చూసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యమంలో పాము కాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు లోను కాగా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

గంగమ్మ ఆలయ చైర్మన్‌గా రెడ్డెయ్య నియామకం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు రాయల సీమలోనే అత్యంత వైభవంగా జరగనున్న అనంతపురం గంగజాతర సందర్భంగా నూతన చైర్మన్‌గా మురికినాటి రెడ్డెయ్యను నియమించినట్లు ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్‌రాజు తెలిపారు. తన నియామకానికి సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జడ్‌పిటిసి రమాదేవిలకు కృతజ్ఞతలు తెలిపారు. జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జాతర విజయవంతం కావడానికి దాతల సహకారం ఎంత అవసరమని పేర్కొన్నారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు నందు

H.M.O.P.NO: 60/2023

కొండవేటి నాగేశ్వరయ్య ...పిటిషనరు

వర్సెస్

కె జ్యోతి భర్త నాగేశ్వరయ్య, నివాసం డోర్ నెంబర్: 3/288, శింగమాల స్ట్రీట్, బిక్కిపల్లి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్

నోటీసు

పిటిషనరు, రెస్పాండెంట్ అయిన నీపై విడాకుల కొరకు పై కోర్టు నందు పై కేసు దాఖలు చేసివున్నారు. మీ హజరు నిమిత్తం పై కోర్టు నందు 11.03.2024 తేదిన వాయిదా వున్నది. కావున మీరు 11.03.2024 తేదిన పై కోర్టు నందు ఉదయం 10.30 గంటలకు మీ అభ్యంతరాలు తెలిపి కోనవలయును. వేనంతట ఏకపక్షముగా తీర్మానించబడును.

//ప్రై ఆర్డర్ అఫ్ ది కోర్ట్//

పి. సురేష్ కుమార్

పిటిషనర్ తరపు న్యాయవాది

నేడు పైడిపాలెం ప్రాజెక్టుకు ఎంపీ రాక

సింహాద్రిపురం : పైడిపాలెం ప్రాజెక్టు వద్ద గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు వద్ద మూడు కోట్ల రూపాయలతో నిర్మించిన గెస్ట్‌హౌస్, సబ్ డివిజన్ కార్యాలయం, వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు ఆయన కోరారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

వైసిపిప్రభుత్వం వైద్యం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకవస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బండపల్లె గ్రామం, పొత్తుకూరుపల్లెలో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగానికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. ప్రజా ఆరోగ్య ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను ప్రజల ముంగిటకు తీసుక వెళ్లారని చెప్పారు. గ్రామీణ ప్రజలకు వారి ఇంటివద్దకే ప్రాథమిక వైద్య చికిత్సలు, వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుక వచ్చామని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు చిన్న చిన్న వ్యాధులకు కూడా సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారు నివసించే ప్రదేశంలోనే విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. విలేజ్ క్లినిక్‌లో అవుట్ పేషెంట్, ఎక్సామినేషన్, లేబరేటరీ, పార్మశీ, వెయిటింగ్ హాల్ వంటిసౌకర్యాలు ఉన్నాయని అన్నారు. 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తాంని చెప్పారు.65 రకాల మందులు అందుబాటులో వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు గడికోట జనార్ధనరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కదిరన్న, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, వైస్ ఎంపిపి రవి శంకర్ రెడ్డి, బాబు, సర్పంచ్ రవి శంకర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలకు : 'కొరముట్ల'

రైల్వేకోడూరు : విద్యార్థులతో కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీధరణి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు ప్రశాంతంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉపసర్పంచ్ తోటశివసాయి, పట్టణ కన్వీనర్ రమేష్, ప్రిన్సిపల్ సుకుమార్, కరెస్పాండెంట్ నాగరాజు, రామరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ** :మండలంలోని కలకడ, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐ శ్రీనివాసులు, కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుదన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు, ప్రతి ష్టలు వస్తాయని వారి పేర్కొన్నారు. పరీక్షల సమయంలో టివి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, వేకువజామునే మేల్కొని చదవాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, వల్లవోలు సర్పంచ్ వివి.ఆయేషా ఇస్తియాక్ సూచించారు. బాలికోన్నత పాఠశాల కలికిరి జడ్‌పి ఉన్నత పాఠశాల(ఉర్దూ), గడిలో పదవ వతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానో పాధ్యాయుల అధ్య క్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్లవోలు సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసు కున్న విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు, తలి దండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుక రావాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పూర్వ ఇంగ్లీష ఉపాధ్యాయులు ఇమాముద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడ : సమావేశంలో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు

తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చొరవ చూపాలని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఏర్పాటుచేసిన మండల సమావేశానికి జడ్‌పిటిసి రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నపు విశ్వనాథరెడ్డిలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమస్యలపై ఆరా తీశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25కు సంబంధించి 300 ఎకరాలు మామిడి మొక్కలు నాటు కోవడానికి మండల ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు సభ్యులకు తెలిపారు.. రూ.1.95కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని లక్కిరెడ్డిపల్లి మండల రైతులకు మంజూరు అయిందని అన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ జాతరకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించాలని సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి వైద్యులకు సూచించారు. మండలంలోని మద్దిరేవుల గ్రామం అప్పలరాజు గారి పల్లె , బిల్డింగ్ హరిజన, అనంతపురం గ్రామం వడ్డేపల్లి , ఈడిగపల్లె, గంగమ్మ ఆలయం పరిధిలోను, కాకులవరం గ్రామం మునిరెడ్డిగారిపల్లే,ఎస్సీ కాలనీ, కుర్నూతుల గ్రామం మూలపల్లె, వాయల్రాజుగారిపల్లె, ఎగువ, దిగువ గొల్లపల్లెలో పూర్తిస్థాయిలో తాగునీటి కొరత దాపురించిందని తక్షణమే తాగునీటి కొరకు బోర్ల ద్వారాను, ట్యాంకర్ల ద్వారాను నీటిని అందించాలని సూచించారు. జాతర సందర్భంగా చాగలగుట్టపల్లెలో తాగునీటి కొరత తీర్చాలన్నారు. బి.ఎర్రగుడి గ్రామం చెంచర్ల పల్లెలో , నల్లగుట్టపల్లెలో, పుట్టకాలవాండ్లపల్లె కాలనీలో కూడా తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. పాలెంగొల్లపల్లి, చిన్నపొతుల్లపల్లి, ఎస్‌సి కాలని, గొల్లపల్లి లోనూ, దప్పేపల్లి గ్రామం గొల్లపల్లి, కొత్తపల్లి, రెడ్డివారిపల్లి,లలో నీళ్ళు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.30 పాడి పశువులకు పశు బీమా చేయడం జరిగిందన్నారు. గోపాలమిత్ర ద్వారా గ్రామాల్లో వాటి రైతులకు పశువులకు భీమా చేయించుకోవాలని తెలియజేయాలని సిబ్బందికి సభ్యులు సూచించారు. ఆరు నెలలు నిండిన గొర్రెలు, మేకలకు కూడా ఇన్సూరెన్స్ చేయించుకున్న అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. పిఎం సూర్య ఘర్ అనే పథకం ద్వారా ప్రతి ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.60 శాతం సబ్సిడీతో సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు.10, 11,12 న జరగనున్న గంగ జాతరకు ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తుగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకొని నిరంతరాయంగా అందజేయాలని సూచించారు. ఉద్యానశాఖలో భాగంగా పూలమొక్కలు నాటుకుని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడానికి నివేదికలు ప్రభుత్వానికి పంపించామనీ ఉద్యాన శాఖ అధికారి నాగమణి తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రంగస్వామి ఎంపిడిఒ వెంకటరమణారెడ్డి, వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యులు రవిరాజు, మండల ఉపాధ్యక్షులు రౌతు నాగలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎంపిటిసి సభ్యులు దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, కోదండ శ్రీలత, రామాసుబ్బమ్మ, లక్ష్మీనారాయణ, జగన్మోహన్‌రెడ్డి, సర్పంచులు వెంకటనారాయణ రెడ్డి గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, రమణయ్య, నాగిరెడ్డి, బాబు, పిఆర్ఎఇ సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి, ఫారెస్ట్ రేంజ్ అధికారి స్ఫూర్తి, ఎంఇఒలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, వ్యవసాయ అధికారి రమేష్ బాబురావు, దేవలంపల్లె పిహెచ్‌సి వైద్యులు సిద్దయ్య, సుమలత, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

అభివృద్ధి కోసం అవకాశమివ్వండి :'మండిపల్లి'

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒకసారి తనకు అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాలేటమ్మ ఆలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనపై ప్రజలు విసుగు చెందారని అన్నారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబు నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500, చదువుకునే పిల్లలకు సంవత్సరానికి రూ.15వేలు అందిస్తారని చెప్పారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఇద్దరూ కూడా రాయచోటి నుంచి పోటీ చేస్తున్నామని, ఇద్దరినీ గెలిపిస్తే వెనుకబడిన రాయచోటి ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'చింతల'

ప్రజాశక్తి-కలికిరి

వైసిపి ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండలంలోని చీకటిపల్లి గ్రామపంచాయతీలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వ కార్యాలయాన్ని గ్రామ పరిధిలోకి తీసుకువచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. విద్య, వైద్యం సదుపాయాలు, సామాన్య ప్రజలకు అందుబాటు లోకి తీసుకవచ్చారని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించడానికి వాలటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకున్నారని చెప్పారు. విద్యార్థులకు అమ్మఒడి, నాడు-నేడు ద్వారా పాఠశాలల పునరుద్ధరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా విద్యార్థులకు లాప్‌టాప్‌లు అందజేత, మహి ళలకు ఆసరా, చేయుత, రైతుకు రైతు భరోసా, విత్తనాలు పంపిణీ, సబ్సిడీ ద్వారా ఎరువులు పంపిణీ, వైద్యరంగంలో అనూ హ్యంగా రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కార్డు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సంక్షేమ పాలన కోసం మరో మారు వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీనాథ్‌రెడ్డి, మాజీ మార్కెపేడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజా లోకవర్దన్, ఎంపిడిఒ రామకృష్ణ, సర్పంచ్‌లు వెంకట్రెడ్డి, గంగయ్య, సురేందర్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబెర్ రిజ్వాన్, నాయకులు మధురెడ్డి, మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటపతి పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల

కమిషనర్‌తో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

ప్రభుత్వ స్థలంలోనే కాలువలు నిర్మించండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని నిర్మిస్తున్న మురుగునీటి కాలవలను ప్రభుత్వ స్థలం ఉన్న మేరకు నిర్మించాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్‌అహ్మద్ బుధవారం నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్‌ను కోరారు. పట్టణంలో కాలువలు నిర్మాణం రోడ్డు ఆనుకొని కాకుండా ప్రభుత్వ స్థలం ఎక్కడ వరకు ఉందో అక్కడ వరకు కాలువలు నిర్మించాలని అన్నారు. ఈ అంశంపై కమిషనర్ పి.ఆర్.మనోహర్ రోడ్డు ఎంత విస్తరణ ఉంది,ప్రభుత్వ స్థలం ఎక్కడ వరకు ఉంది అనే విషయాలను క్షుణంగా పరిశీలించి కాలువలు నిర్మించాలని ఇంజినీర్లను ఆదేశించారు.ఇదివరకే ప్రభుత్వ స్థలంలో క్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు, మెరుగైన పారిశుధ్య పనులపై చర్చించారు. కార్యక్రమంలో జివి.రామకృష్ణ, నక్క సంతోష్, రాయల్ సలీం, నరసింహనాయుడు, రఫీ పాల్గొన్నారు.

కెవికెలోని నర్సరీలను పరిశీలిస్తున్న ముకుందరావు

సాంకేతికతతోనే లాభసాటి వ్యవసాయం

ప్రజాశక్తి-కలికిరి

సాంకేతిక పద్ధతిలో అవలంబిస్తేనే లాభసాటి వ్యవసాయం సాధిస్తామని అంగ్రు విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుంద రావు తెలిపారు. వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన సాంకేతికత, పంట రకాలు పురుగులు, తెగుళ్ళ నివారణ పద్ధతుల గురించి కృషివిజ్ఞా కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సేవలందించాలని తెలిపారు. కెవికెలోని డెమో యూనిట్ లైన వానపాముల ఎరువు, కోళ్లు, పొట్టేళ్ల పెంపకం షేడ్‌నెట్‌లో మామిడి అంటు మొక్కలను పరిశీలించారు. 2023-24 సంవత్సరానికి గాను నిర్వహించి నటువంటి ప్రథమశ్రేణి ప్రదర్శన, క్షేత్రాల గురించి కెవికెలోని శాస్త్రవేత్తలు ఆయనకు వివరించారు. 2024-25వ సంవత్సరంలో నిర్వహించేటటువంటి కార్య ప్రణాళిక గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, డాక్టర్ టి.మురళీకృష్ణ, కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ జిఎస్ పాండురంగ, ఇతర శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలోని 49, 50 పోలింగ్ కేంద్రాలను బుధవారం రాయచోటి ఆర్‌డిఒ మునిస్వామి పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం త్వరితగతిన పునరుదించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఒ వెంకట డిప్యూటీ తహశీల్దార్ అంవిందకిషోర్, విఆర్ఒ, బిఎల్ఒ, వైసిపి నాయకులు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సిద్దేశ్వర స్వామి సన్నిధిలో బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడకు సమీపంలో ఉన్న దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి వారిని రాజంపేట పార్లమెంటు టిడిపి ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో బాలయ్యగారిపల్లి సర్పంచ్ విశ్వనాథ నాయుడు, కార్యకర్తలు మల్లికార్జున నాయుడు, మాధవ నాయుడు, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జాగువారిపల్లి పంచాయతీలో ఉపసర్పంచ్ నాగిరెడ్డి, రాజమౌలాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో తాగునీటి మోటారు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తున్నందున పంచాయతీలో ప్రజలు నీటి కష్టాలు పడకూడదనే ఉద్దేశంతో పంచాయతీలోని మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



బోరుకు మరమ్మతులు చేయిస్తున్న ఉప సర్పంచ్

పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు

సింహాద్రిపురం : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సల్మాన్ రాజ్ సూచించారు. మండలంలోని గురజాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బిదనంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షేక్ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, వైసిపి నాయకులు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వీఆర్వో ఓబయ్య, ఎఎన్ఎం రమాదేవి పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలే

వేంపల్లె : వైసిపి ప్రభుత్వ పాలనలో రైతులకు కష్టాలేనని, సిఎం జగన్ వారిని పట్టించుకొనకపోవడం దారుణమని టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు ఎన్నో సబ్సిడీలు, ఇన్సూరెన్సులు ఇచ్చారన్నారు. కంపోస్టు ఎరువుల తయారీని టిడిపి ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుడడంతో రైతులకు తాయిలం వేస్తారన్నారు. జగన్ సొంత జిల్లాలోని ఒక్క మండలానికి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయకపోవడం చాలా దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, జయచంద్రారెడ్డి, చంద్రమౌళి, ఫయాజ్ బాషా పాల్గొన్నారు.